క్లుప్తంగా

రామాలయంలో కుంకుమ పూజలు



రామాలయంలో స్వామివారికి పూజలు

బలిజిపేట: ధనుర్మాస పూజలలో భాగంగా వెంగాపురం రామాలయంలో గురువారం స్వామివారికి కుంకుమ పూజలు జరిపారు. అర్చకులు గోపాలకృష్ణ, ఫణికుమార్ శర్మ, సూర్యనారాయణల ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలను నిర్వహించారు. ధనుర్మాసంలో విశేష రోజులలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏకాదశి సందర్భంగా ఆలయంలో మహిళలచే కుంకుమ పూజలు జరిపించారు.

నిబంధనలు పాటించాలి



హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ

మక్కువ: వాహనదారుడుతో పాటు, వెనుకన కూర్చున్న ప్రయాణికుడు హెల్మెట్ ధరించాలని ఏఎస్ఐ శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రం మక్కువలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా గురువారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వలన ప్రమాదం సంభవించే సమయంలో ప్రాణాలు కాపాడుకోవచ్చు అన్నారు. వాహనదారులందరు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలను తల్లిదండ్రులు ఇవ్వరాదని సూచించారు. మితిమీరిన వేగం ప్రమాదకరమని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పత్రాలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



పత్రాలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీతీరాన వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి వారు గురువారం భక్తులకు పత్రాలంకరణలో దర్శనమిచ్చారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు గురువారం కావడంతో ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ ప్రధాన అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో స్వామి వారికి అర్చకులతో ప్రత్యేక అలంకరణ చేసారు. పూజల్లో భక్తుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా హక్కుల కోసం పోరాడే పార్టీ సీపీఐ



లిడికివలస గ్రామంలో సీపీఐ జెండా ఎగురవేస్తున్న జీవన్న

పార్వతీపురం టౌన్: ప్రజా హక్కుల కోసం నికరంగా పోరాడేది భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)అని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న అన్నారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలో ఉన్నటువంటి లిడికివలస, పుట్బూరు, పెద్దబొండపల్లి తదితర గ్రామాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పేదలకు భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం అనేక భూ పోరాటాలు చేసి వేలాది ఎకరాలు భూములను పేదలకు పంచిన ఘనమైన చరిత్ర సీపీఐ పార్టీకే ఉందన్నారు. 1925 డిసెంబరు 26న కాన్పూర్లో భారత కమ్యూనిస్టు పార్టీ జెండా ఎగరవేయడం జరిగిందన్నారు. పేదల హక్కుల కోసం సమ సమాజ నిర్మాణం కోసం, సమానతలు లేని సమాజం కోసం సీపీఐ పార్టీ పోరుబాట సాగిస్తుందని, 1/70 అటవీ హక్కుల చట్టం ప్రకారం అటవీ భూముల్లో జీవించే హక్కు ఒక్క గిరిజనులకు మాత్రమే దక్కుతుందన్నారు. భవిష్యత్తులో గిరిజనులందరూ ఐక్యమత్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ పార్టీ జిల్లా సమితి సభ్యులు, బీటీ నాయుడు సానుభూతిపరులు పాల్గొన్నారు.

అంచనాలకందని పంట నష్టం

- అధికారుల నివేదికల్లో కనిపించని నష్టం
- కొన్ని గ్రామాల్లో వరి చేలు పొలాల్లోనే..
- కుప్పల్లో నీరు చేరి పెరిగిన మొలకల శాతం
- మంత్రిగారూ...మా కష్టాలు చూడండి



చంద్రంపేట వద్ద పొలాల మధ్యలో వరికుప్పలు



జీగిరాంలో పొలం గట్లపై వేసిన వరిచేను వోవులు

సాలూరు రూరల్: వరుస తుఫాన్లతో కురిసిన వర్షాలకు పంట నష్టం అన్నదాతకు లెక్క తేలడం లేదు. మరోవైపు అధికారులు అన్నదాతల కష్టాన్ని గుర్తించడం లేదు. అధికారుల లెక్కల్లో 80 నుంచి 90 శాతం వరి చేలు కోతలు పూర్తయ్యాయని చెబుతుండగా క్షేత్ర స్థాయిలో వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. సాలూరు రూరల్‌లోని జీగిరాం, సాలూరు పట్టణ పరిసర ప్రాంతాలతో పాటు కొత్తవలస, బంగారమ్మపేట, కరకవలస గ్రామాల్లో ఇప్పటి వరకు సగం చేలు కూడా కోతలు పూర్తి కాలేదు. కోసిన చేలు కూడా ఇంకా పొలాల్లోనో.. గట్లపైనో.. లేక కుప్పలుగానో ఉన్నాయి. ఇవన్నీ వర్షానికి తడిసి ముద్దయ్యాయి. ఈ పరిస్థితుల్లో అధికారులు తమ నివేదికల్లోగాని, ప్రకటనల్లోగాని తమ పరిస్థితిని వివరించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలాగైతే నష్టపోయిన పంట పరిహారం దేవుడెరుగు.. కనీసం మొలకలు వచ్చిన ధాన్యం, రంగుమారిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు తీసుకుంటాయో.. లేవోనని ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండా చిన్న, సన్నకారు రైతులు తమ ఇంటి వాడుక కోసం ఎకరా.. అరెకర వరి పంట ఆలస్యంగా కోసి కుప్పలు వేసుకున్నారు. చంద్రంపేట, బాగువలస, పురోహితునివలస, ఏజెన్సీ గ్రామాల్లో చాలా చోట్ల పంట చేలు కుప్పలుగానే పొలాల్లో తడిసి ముద్దయి కనిపిస్తున్నాయి. వీటిని చూసి రైతులు మరింత డీలా పడుతున్నారు. కళ్ల ముందు తమ చేల పైనుంచి వర్షం నీరు పారుతుంటే ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు ఆవేదన చెందుతున్నారు.

మంత్రిగారూ... మా భాదలు చూడండి

మండలంలోని వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు నష్టపోయిన తమ పరిస్థితిని మంత్రిగారు పట్టించుకోవాలని రైతులు కోరుతున్నారు. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో ఉన్న అన్ని పంటలు చేలు దెబ్బ తిన్నాయని తమన ప్రభుత్వమే ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ఈ నష్టాన్ని ఏ విధంగా గుర్తిస్తారో రైతుని ఏ విధంగా ఆదుకుంటారో గిరిజన శాఖ మంత్రి చెప్పాలని రైతులు కోరుతున్నారు. ఇంతవరకు రైతు కష్టాన్ని ఏ విధంగా గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం నష్టం పెద్దగా లేదని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

మొలకలు వచ్చాయి..



పంట చేలు కోసిన మరుసటి రోజు నుంచే తుఫాన్ మొదలైంది. వర్షంలోనే చేను గట్లపై వేసాను. అయినా మొలకలు వచ్చేసాయి. అమ్మగా మిగిలినవి తినడానికి దాచుకోవాలి. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. వ్యాపారులు కొనుగోలు చేయరు. కొనుగోలు కేంద్రంలో పెట్టిన ఆంక్షలకు ధాన్యం తీసుకుంటారన్న గ్యారంటీ లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి తమను ఆదుకోవాలి.

– సూర అప్పలనాయుడు రైతు, జీగిరాం

మున్సిపల్ కార్మికుల ఆందోళన



పురపాలక సంఘాలు, కార్పొరేషన్లలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మన్యం జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. కార్మిక సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా రాష్ట్ర యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి గురువారం ఆందోళన చేసారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. జీఓ 36 అమలు చేసి రూ.24,500 వేతనం ఇవ్వాలని, పెండింగ్, రెగ్యులర్ జీతాలు వచ్చే నెల మొదటి వారంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక నాయకులు రాములు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

– సాలూరు

ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను నియమించాలి



పీహెచ్‌సీ వద్ద మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు వెంకటరమణ

పార్వతీపురం టౌన్: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను నియమించాలని సీపీఎం నాయకులు గొర్లి వెంకటరమణ డిమాండ్ చేసారు. జగన్నాధపురంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీపీఎం ప్రతినిధి బృందం గురువారం సందర్శించి అక్కడ రోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్నాధపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ వైద్యులు లేరని, వైద్యులు చేయాల్సిన వైద్యాన్ని అవగాహన లేని సిబ్బంది చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇది అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి అని హెచ్చరించారు. పార్వతీపురంలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా గుర్తించబడిన జగన్నాధపురం ప్రాంత ప్రజలకు ఎంతో అవసరమైన ఈ ఆస్పత్రి విషయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. గత నెలలో ఈ ఆస్పత్రిని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సందర్శించారని, అయినప్పటికీ అక్కడ వైద్యులను నియమించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో వైద్యం ప్రజలకు అందుబాటులోకి రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి అర్బన్ హెల్త్ సెంటర్లో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పాకల సన్యాసిరావు, బీవీ రమణ, బంకురు సూరిబాబు, పి. రాజశేఖర్, జి.తులసి ఉన్నారు.

వాకింగ్ ట్రాక్‌ను నిర్మించాలి

పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీలోని 1, 2, 29, 30 వార్డుల ప్రజలకు ఎంతో అవసరమైన పాత్రుడు కోనేరుని అభివృద్ధి చేసి, కోనేరు గట్టును వాకింగ్ ట్రాక్‌గా మార్చాలని సీపీఎం పార్టీ నాయకులు గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. గురువారం పాత్రుని కోనేరుని పరిశీలించి కోనేరు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు.

గోదాదేవి అమ్మవారి తిరువీధి



సీతానగరం మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీతీరాన వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వేకువజామున గోవింద మాలలు ధరించిన భక్తులు గోదాదేవి అమ్మవారిని పల్లకీలో ఊరేగిస్తూ తిరువీధి నిర్వహించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన వస్త్రాలను అలంకరించి పూలతో ప్రత్యేక అలంకరణ చేసి పల్లకిలో తిరువీధి చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేసారు.

– సీతానగరం

సమ్మె నాటి ఒప్పందాలు అమలు చేయాలి

పార్వతీపురం టౌన్: గత సమ్మెనాటి ఒప్పందాలు అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. పట్టణంలోని మున్సిపల్ కార్యాయంవద్ద సీపీఎం పార్టీ నాయకులతో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ కోశాధికారి జీవీ రమణ మాట్లాడుతూ .రాష్ట్రంలో సమ్మె జరిగే ఒక సంవత్సరం పూర్తయిన మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదని విమర్శించారు. ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచకుండానే వెట్టి చాకిరీ చేయించి, కమిటీ వేసి చేతులు దులుపుకుందని, వెంటనే పెరిగిన ధరలకు తగ్గట్టుగా ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలన్నీ కార్మికులకు అందేలా జీఓ ఇవ్వాలన్నారు. సంక్రాంతి వస్తున్నందున అన్ని పట్టణాల్లో కాంట్రాక్ట్ కార్మికులందరికీ సబ్బులు, నూనెలు, చెప్పులు, బట్టలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన విధంగా కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, లేకుంటే భవిష్యత్తులో జరిగే ఆందోళనకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సింహాచలం, పార్వతీపురం పట్టణ కమిటీ నాయకులు ఎస్.శంకర్రావు, మామిడి శివ, బి.రాజేష్, శివప్రసాద్, పాపులమ్మ, ఇప్పలమ్మ పాల్గొన్నారు.

పశువులకు ప్రమాదకరంగా
గొంతువాపు వ్యాధి



పశువులు

బలిజిపేట: వాతావరణ ప్రభావంతో సీజనల్‌గా పశువులకు గొంతువాపు వ్యాధి సోకే అవకాశాలున్నాయి. వాతావరణం మార్పులు, తేలికపాటి వర్షాలు పడుతుండడం, చలి పెరగడం వలన వ్యాధి లక్షణాలు సోకుతాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని పశువుల యజమానులు తగు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది.

వ్యాధి వ్యాప్తి ఇలా..

గొంతు వాపు వ్యాధి ముఖ్యంగా గేదెలు, దున్నల్లో కనిపిస్తుంది. ఆవులు, ఆవు దూడల్లో తక్కువగా కనిపిస్తుంది. వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గినప్పుడు, వర్షంలో ఎక్కువగా తడిసినప్పుడు అటు ఎండుగడ్డి, ఇటు పచ్చిగడ్డి మేసిన పశువులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ఇలాంటి సమయాల్లో వ్యాధికారక సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది పశువులు ఇబ్బంది పడతాయి. వ్యాధి సోకిన పశువులు మేత తినవు. నీరసించి అలసటగా కనిపిస్తాయి. అలాంటి పశువుల వద్ద ఉన్న ఇతర పశువులకు వ్యాధి సోకుతుంది.

లక్షణాలు

గొంతు వాపు వ్యాధి సోకిన పశువుల్లో దవడల మధ్య గొంతు పైభాగాన, మెడకింద వాపు వస్తుంది. ఈ వాపులో రక్తం కనిపిస్తుంది. కళ్లు ఎర్రగా తయారై నీరుగారుతుంటాయి. పశువులు, ఆయాసంతో శ్వాస పీలుస్తూ శబ్దం చేస్తుంటాయి. తీవ్ర జ్వరానికి గురవుతాయి. పశువులు మేత సరిగా తినకపోయినా, అలసటగా కనిపించి నాలుక బయటకు పెడతాయి. అలాంటి పశువులు 24గంటల్లో చనిపోయే అవకాశం ఉంది.

చికిత్స ఇలా..

వ్యాధి లక్షణాలు కనిపించిన పశువులను దగ్గరల్లో ఉన్న పశువైద్య కేంద్రాలకు తీసుకువెళ్లాలి. యాంటిబయాటిక్ మందులు వేయించాలి. వ్యాధి సోకిన పశువులు, గేదెలను మిగతా వాటిలో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వైద్యుల సూచనల మేరకు తరుచుగా పాకల్లో వ్యాధికి సంబంధించిన రసాయనిక, క్రిమి సంహారక మందులను చల్లుతుండాలి. వ్యాధి సోకిన పశువులు తినగా మిగిలిన గడ్డిని కాల్చివేయాలి. మల, మూత్రాలను గుంతలో పూడ్చిపెట్టాలి. ముందు జాగ్రత్తల్లో భాగంగా టీకాలు అన్ని పశువులకు వేయించాలి.

వైద్యులను సంప్రదించాలి

పశువులకు గొంతువాపు వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించాలి. చలిగాలి తగలకుండా జాగ్రత్తలు పాటించాలి. వైద్యుల సూచనల మేరకు పశు సంరక్షణ చేయాలి. ముందస్తుగా వేక్సిన్ వేయడం జరిగింది. వ్యాధి లక్షణాలు సోకే అవకాశం లేదు.

– గణేష్, మండల పశు వైద్యాధికారి, బలిజిపేట

నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట



- పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలి
- మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పిలుపు



సాలూరు: రాష్ట్రంలో కూటమి పాలనలో ప్రజలపై మోయలేని విద్యుత్ భారాలను వేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శుక్రవారం తలపెట్టిన పోరుబాట కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. రాష్ట్రంలో చంద్రబాబు పాలన ప్రజలపై బాదుడు పాలనగా మారిందని విమర్శించారు. కరెంటు చార్జీలు పెంచబోమని, అధికారంలోకి వస్తే తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు నేడు పెంచుకుంటూ పోతున్నారని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేయాల్సి ఉండగా వారికి సైతం రూ.వేలల్లో బిల్లులు వస్తున్నాయని విమర్శించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఉన్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్/ఏడీఈ, ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద శుక్రవారం 10.30 గంటలకు పోరుబాట కార్యక్రమం జరగనుందని అందరూ తరలిరావాలని కోరారు.

పార్వతీపురం టౌన్: కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ శుక్రవారం తలపెట్టిన పోరుబాట కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఆయన విలేకరులతో గురువారం మాట్లాడారు. కరెంటు చార్జీల బాదుడుపై పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజలతో శుక్రవారం నిరసన తెలియజేయనున్నట్టు తెలిపారు. వైఎస్సార్ విగ్రహం కూడలి నుంచి ర్యాలీగా బయలుదేరి బెలగాం విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకుని విద్యుత్ చార్జీల పెంపును తగ్గించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్టు తెలిపారు. పార్వతీపురం నియోజకవర్గ పరిధిలోని గ్రామ, వార్డు స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు గల పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అందరూ ఉదయం 10 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకోవాలని అక్కడ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు.

విద్యుత్ కార్మికుల పోరాటానికి అండగా సీఐటీయూ



సీఐటీయూ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేసిన నాయకులు, కార్మికులు

బలిజిపేట: విద్యుత్ డిస్కంల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న కార్మికులకు సంఘీభావంగా స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు మాట్లాడుతూ ఒక ప్రైవేటు కార్పొరేట్ సంస్థ అయిన ఇమినేంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్‌కు విక్రయించడానికి నోటిఫికేషన్ జారీ చేయడం అన్యాయమన్నారు. ఈ సంస్థలో కేవలం 500 మంది రెగ్యులర్, 500 మంది కాంట్రాక్ట్ కార్మికులు మాత్రమే పని చేస్తున్నారని తెలిపారు. వేల కోట్ల లాభాలు గడిస్తున్న ఈ విద్యుత్ డిస్కంలను చౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టడం దారుణమన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేయడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని విమర్శించారు. అంతకు ముందు ఈ ఉద్యమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో పి.అప్పారావు, జి.సత్యనారాయణ, సత్యం, మూర్తి, గంగులు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో జాగ్రత్తలు పాటించండి



పొలంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ

బలిజిపేట: వర్షాల కారణంగా పంట పొలాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలోని గంగాడ, గలావల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పెరుగుదల దశలో ఉన్న మొక్కజొన్న పైరు అధిక వర్షాలు లేదా ముంపుకు గురైతే నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు. ఎకరానికి 50 కిలోలు యూరియా, 20కిలోలు పొటాష్ ఎరువులను పై పాటుగా వేసుకోవాలన్నారు. ఆకు ఎండు తెగులు ఉధృతి అయ్యే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు ఒక ఎంఎల్ ప్రోపికోనజోల్‌ను ఒక లీటరు నీటికి కలిపి చేను బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలన్నారు. వర్షాలు తగ్గిన 3-4రోజుల తరువాత వరసలు మధ్య భాగాన్ని గుంటకతో కాని, గొప్పు ద్వారా కాని సేద్యం చేయాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారుల నిలదీత



మాట్లాడుతున్న ఎంపీపీ రవణమ్మ

సీతానగరం: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులు పూర్తి కావచ్చినా ఇప్పటి వరకు బిల్లులు చెల్లించకపోవడంపై మండల సభ్యులు పలువురు అధికారులను నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బలగ రవణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో సభ్యులు జగదీశ్వరరావు, బి.కుసుమ, శనపతి నిర్మల మాట్లాడుతూ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించి పూర్తి కావచ్చిన బిల్లులు చెల్లించకపోవడంపై నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో పనులు చేసిన బిల్లులు చెల్లింపులు పూర్తయ్యాయని, డిపాజిట్లు ఇవ్వడం లేదని తెలిపారు. వీఆర్ఎస్ కాలువ 18 ఎల్‌కు సంబంధించి రామవరం - అంటిపేట(3/2) వద్ద కాలువ స్లాబ్ కల్వర్టు చిన్నగా కారడంతో వర్షాకాలంలో పంట పొలాలు నీట మునిగి నష్టం వాటిల్లుతుందని తెలిపారు. కాలువ అభివృద్ధికి లైన్ ఎస్టిమేషన్ కావాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారిని కోరినా ఇప్పటి వరకు ప్రతిపాదన పత్రాలు ఇవ్వడం లేదని రామవరం సర్పంచ్ సత్యంనాయుడు ఆరోపించారు. అసంపూర్తిగా ఉన్న జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలని తామరకండి, పెదంకలాం సర్పంచ్‌లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములునాయుడు, ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు, డీటీ ఉమామహేశ్వరరావు, ఏఈ పవన్‌కుమార్, వెలుగు ఏపీఎం శ్రీరాములు, ఎంఈఓ సూరిదేముడు, ఐసీడీఎస్, పశువైద్య, వైద్యారోగ్య శాఖ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.